

# యువనాయక
# వివేకానంద

# యువనాయక వివేకానంద

కూర్పు :

స్వామి శ్రీకాంతానంద

తెలుగు సేత

అమిరపు నటరాజన్

వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన ఎక్సలెన్స్

రామకృష్ణమఠం

హైదరాబాద్ - 500 029

360.922
నట - యువ

ప్రచురణ :

అధ్యక్షులు

రామకృష్ణమఠం

వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్

హైదరాబాద్ – 500 029

మొదటి ముద్రణ : అక్టోబర్ 2002

రెండవ ముద్రణ : ఏప్రిల్ 2003

మూడవ ముద్రణ : ఏప్రిల్ 2004

నాల్గవ ముద్రణ : జనవరి 2005

ఐదవ ముద్రణ : అక్టోబర్ 2005

ప్రతులు : 5000

వెల : రూ 6/-

ముద్రణ :

విస్తార్ గ్రాఫిక్స్

1-1-316/6, చిక్కడపల్లి

హైదరాబాద్ - 500 020.

C17112

99351

హైదరాబాద్ - 5000

# స్వామి వివేకానంద
# సంక్షిప్త జీవిత చరిత్ర
## బాల్యం

బాల్యంలో వివేకానంద స్వామిని నరేంద్రనాథ్ దత్త అని, ముద్దుగా నరేన్ అని పిలిచేవారు. ఆయన కలకత్తానగరంలో విశ్వనాథ్ దత్త, భువనేశ్వరి దేవి దంపతులకు 1863వ సంవత్సరం జనవరి 12వ తేదీ సోమవారం జన్మించారు. దత్త కుటుంబీకులు ధనికులే గాక సంఘంలో మంచిపేరున్నవారు. దాతృత్వానికి, విద్యాధికతకూ, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను కాంక్షించే వారుగానూ పేరెన్నికగన్నారు. నరేంద్రుడి తాత అయిన దుర్గాచరణ్ దత్త పర్షియన్, సంస్కృతభాషలలో గొప్ప పాండిత్యాన్ని కలిగిన న్యాయవాది. కానీ విశ్వనాథ్ జన్మించిన తర్వాత ఆయన సన్న్యసించారు. అప్పటికాయనకు 25 సంవత్సరాల వయస్సు మాత్రమే.

కలకత్తా హైకోర్టులో విశ్వనాథ్ దత్త ఒక న్యాయవాది. అతడు ఆంగ్ల, పర్షియన్ భాషలలో గొప్ప పండితుడు.

పర్షియన్ కవి అయిన హాఫీజ్ రచించిన కవితలను చదివి తన కుటుంబానికి వినిపించేవాడు. బైబిల్ గ్రంథాన్ని చదవడంలోనూ, సంస్కృతంలోని హిందూశాస్త్రాలను చదవడంలోనూ గొప్పగా ఆనందించేవాడు. మితిమీరిన దాతృత్వాన్ని, పేదలపట్ల జాలిని కలిగివున్నా మతసాంఘిక విషయాలలో హేతుబద్ధమైన, అభ్యుదయ భావాలను కలిగివుండేవాడు. బహుశా పాశ్చాత్య సంస్కృతి ప్రభావంవల్ల ఆయనకు ఆ గుణాలు కలిగి ఉండవచ్చు. భువనేశ్వరీదేవి ఏ పనినైనా సమర్థంగా నిర్వహించగలిగిన రాజకుటుంబీకురాలు. నరేంద్రుడు పుట్టకముందు కొందరు కుమార్తెలు పుట్టినా కొడుకు కావాలన్న కోరికతో ఆమె వారణాసిలోని వీరేశ్వర శివునికి పూజలు జరిపించమని తన బంధువులలో ఒకరిని కోరారు. తరువాత శివుడు ఆమెకు కలలో కనిపించి, 'నీకు కొడుకుగా పుడతాన'ని మాట ఇచ్చినట్టు చెప్పుకుంటారు. ఆ తర్వాత కొంతకాలానికి నరేంద్రనాథ్ జన్మించాడు.

చిన్నతనంలో నరేంద్రనాథ్ ఎంతో ఉల్లాసంగా, అల్లరివాడుగా ఉండేవాడు. కానీ అదే సమయంలో

అతనికి అధ్యాత్మిక విషయాలమీద గొప్ప ఆసక్తి ఉండేది. రాముడు, సీత, శివుడు మొదలైన దేవుళ్ళ బొమ్మల్ని పూజిస్తూ, ధ్యానిస్తూ ఆడుకునేవాడు. తన తల్లి చెప్పిన రామాయణ, మహాభారత కథలు అతని మనస్సు మీద చెరగని ముద్రవేశాయి. పువ్వు పుట్టగానే పరిమళించినట్లు, ధైర్యం, పేదలపట్ల జాలి, దేశద్రిమ్మరులై వచ్చే సన్న్యాసులపట్ల ఆకర్షణ మొదలైన గుణాలు అతనిలో పసితనంలోనే కనిపించాయి. చిన్నతనంలోనే ఎవరేది చెప్పినా దాన్ని నిరూపించి చూపమని నరేంద్రనాథ్ సవాలు చేసేవాడు. మదికీ, హృదికీ తలమానికమైనటువంటి ఈ సద్గుణాలతో అతడు ఒక శక్తిమంతుడైన యువకునిగా ఎదిగాడు.

## శ్రీ రామకృష్ణుల చరణకమలాల వద్ద

యువకునిగా, నరేంద్రనాథ్ తన సింహంలాంటి రూపానికి సరితూగే ధైర్యాన్ని కలిగివుండేవాడు. మంచి వస్తాదు వంటి శరీరనిర్మాణాన్ని, సుస్వరమైన గొంతును,

ప్రకాశమానమైన బుద్ధిని కలిగివుండేవాడు. సాముగరిడీలలోనూ, తత్త్వశాస్త్రంలోనూ, సంగీతం లోనూ తన తోటివారి మధ్య తిరుగులేని నాయకుడిగా పేరెన్నికగన్నాడు. కళాశాలలో పాశ్చాత్య తత్త్వాన్ని అధ్యయనం చేసి ఒంటపట్టించుకున్నాడు. తద్వారా అతని మనస్సులో విషయాలను సూక్ష్మంగా పరిశీలించేశక్తి నాటుకుపోయింది. పుట్టుకతో అలవడిన లక్షణాలయిన ఆధ్యాత్మికతపై మక్కువ, సనాతన మతసాంప్రదాయాలమీద, నమ్మకాలమీద గౌరవం ఒకప్రక్క, మరొకప్రక్క పదునైన బుద్ధితో జతగూడిన అతని విమర్శనాత్మక స్వభావం ఇప్పుడు ఒకదానితో ఒకటి తలపడ్డాయి. ఇటువంటి సందిగ్ధసమయంలో, ఆ కాలంలో బాగా ప్రాచుర్యంలో ఉన్న మత-సాంఘిక ఉద్యమమైన బ్రహ్మసమాజంలో చేరి కొంత ఊరట పొందడానికి ప్రయత్నించాడు. బ్రహ్మ సమాజం నిరాకారదైవాన్ని నమ్మి, విగ్రహారాధనను తూలనాడి, అనేక విధాలయిన సాంఘిక సంస్కరణలను చెయ్యడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. నరేంద్రనాథ్ అనేకమంది పేరెన్నికగన్న మతనాయకులను కలుసు

కున్నాడు. కానీ వారెవ్వరూ, 'దేవుడు ఉన్నాడా, లేడా?' అన్న అతని ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. ఇది అతని ఆధ్యాత్మిక అశాంతిని మరింతగా పెంచింది.

ఇటువంటి చిక్కుపరిస్థితిలో, కలకత్తాకు కొద్ది దూరంలో, దక్షిణేశ్వరంలో ఒక సాధువు ఉన్నాడని తన ఆచార్యుడైన విలియం హేస్టీ చెప్పినమాటలు గుర్తుకు వచ్చాయి. వర్డ్స్‌వర్త్ తన "విహారము" అన్న కవితలో వర్ణించిన పారవశ్యస్థితిని ఆ సాధువు అనుభూతి చెందాడని హేస్టీ వివరించాడు. అతడి జ్ఞాతి అయిన రామచంద్ర దత్త కూడా ఆ సాధువును దర్శించమని నరేంద్రుణ్ణి ప్రోత్సహించాడు. ఆ విధంగా 1881లో ఆధునిక భారతదేశపు దివ్యద్రష్ట అయిన శ్రీరామకృష్ణునికి, అతని సందేశప్రచారకుడైన నరేంద్రునికి పరిచయం కలిగింది. "అయ్యా! మీరు దేవుణ్ణి చూశారా?" అని నరేంద్రనాథ్ ప్రశ్నించాడు. "ఔను! నేను భగవంతుణ్ణి చూశాను! నిన్నిప్పుడు చూస్తున్నదానికన్నా స్పష్టంగా చూశాను!" అని శ్రీరామకృష్ణులు సమాధానమిచ్చారు. ఎట్టకేలకు తన

సొంత అనుభూతి ద్వారా దేవుణ్ణి దర్శించిన ఒక మనిషి నరేంద్రుడికి లభించాడు. అతని అనుమానం తొలగిపోయింది. శిష్యునిగా శిక్షణ ప్రారంభమయింది.

శ్రీరామకృష్ణులు నరేంద్రుణ్ణి అనేకరకాలుగా పరీక్షించారు. దానికి ప్రతిగా, శ్రీరామకృష్ణులు తాను అనుభూతి చెందినట్టు వర్ణించిన ఆధ్యాత్మికస్థితులలో నిజం ఎంతవరకూ ఉందో తెలుసుకోవడానికి ఆయనను అనేకవిధాలుగా నరేంద్రుడు పరీక్షించి చూశాడు. తన తండ్రి 1884లో గతించిన తర్వాత నరేంద్రుడి కుటుంబం అనేకవిధాలుగా ఇక్కట్లపాలయింది. గురుదేవుల సలహామీద దక్షిణేశ్వరంలోని కాళికాదేవిని తన కుటుంబపు బాధల్ని తీర్చమని ప్రార్థించడానికి వెళ్ళాడు. అయినప్పటికీ, తనకు డబ్బు అవసరం ఉందని తెలిసికూడా భక్తిజ్ఞానాల కోసం మాత్రమే ప్రార్థించగలిగాడు.

క్రమక్రమంగా నరేంద్రుడు గురుదేవులకు శరణాగతుడయ్యాడు. తన అంతులేని ఓరిమితో శ్రీరామకృష్ణులు తన యువశిష్యుని యొక్క సంప్రదాయ

వ్యతిరేకధోరణిని అణగార్చి, సంశయస్థితిలోనుంచి దృఢనిశ్చయానికి, ఆవేదన నుండి ఆధ్యాత్మిక ఆనందానికి అతనిని తీసుకొనిపోయారు. కానీ శ్రీరామకృష్ణులందించిన మార్గదర్శకత్వంకన్నా ఆయన ప్రేమయే ఆ యువశిష్యుని మనస్సును మరింతగా చూరగొన్నది. ఆ ప్రేమను అంతే నిండుదనంతో ఆ శిష్యుడు తిరిగి గురువుకు అందించాడు.

శ్రీరామకృష్ణులు జబ్బుపడినప్పుడు చికిత్సకోసం ఆయనను కలకత్తా పొలిమేరల్లోని కాశీపూర్‌కు తరలించారు. అక్కడ తన గురువు ఆధ్వర్యంలో నరేంద్రుడి చివరి విడత శిక్షణాకార్యక్రమం మొదలైంది. ఆ సమయంలో నరేంద్రుడు తీవ్రమైన తపస్సాధనలను చేశాడు. శ్రీరామకృష్ణులు తన యువ శిష్యులందరినీ నరేంద్రుడి నాయకత్వంలోకి తేవడానికి కృషిచేశారు. నరేంద్రుడు తనకు సర్వోత్కృష్ట పారమార్థికస్థితి అయిన నిర్వికల్ప సమాధిని ఇవ్వమని శ్రీరామకృష్ణులను కోరినప్పుడు ఆయన, "సిగ్గులేదా! నువ్వొక పెద్దమర్రిచెట్టులాగా పెరిగి, ఈ ప్రపంచపు బాధలలో మాడిపోతున్న వేలమందికి నీడనిస్తావని

నేననుకుంటున్నాను. కానీ ఇప్పుడు చూస్తే నువ్వు నీ మోక్షాన్నే కోరు కుంటున్నావు" అని మందలించారు. అయినప్పటికీ నరేంద్రుడికి ఆ అనన్యసామాన్యమైన అనుభూతి సిద్ధించింది. కానీ, "నువ్వు జన్మించిన కార్యం సిద్ధించేవరకూ ఈ అనుభూతికి తాళంచెవి నా దగ్గరే ఉంటుంద"ని గురుదేవులు అతనికి చెప్పారు. తన మహాసమాధికి మూడునాలుగురోజుల ముందు గురుదేవులు తన ఆధ్యాత్మికశక్తినంతా నరేంద్రుడికి ధారపోసి, "ఇప్పుడు నీకిచ్చిన శక్తితో మహత్కార్యాలు సాధించబడతాయి. దాని తర్వాతే నువ్వు నీ ధామానికి చేరుకుంటావ"ని చెప్పారు.

గురుదేవులు 1886వ సంవత్సరం ఆగస్టునెలలో మహాసమాధి చెందిన తర్వాత నరేంద్రుడి నాయకత్వంలో యువశిష్యులందరూ బారానగర్‌లో ఒక పాడుబడిన అద్దెకొంపలో చేరారు. ఇక్కడే, తీవ్రమైన తపస్సాధనల మధ్య "శ్రీరామకృష్ణ సోదరబృందా"నికి పునాది పడింది. ఇక్కడ ఉంటున్న రోజులలోనే నరేంద్రనాథ్ పలువురు సోదరశిష్యులతో కలిసి అంత్‌పూర్‌కు వెళ్ళారు. అక్కడ 'క్రిస్టమస్ ఈవ్'

పర్వదినాన (1886) వాళ్ళందరూ ఒక పెద్దమంటవేసి దానిచుట్టూ కూర్చుని సన్న్యాసదీక్ష తీసుకున్నారు. బారానగర్‌లో గడిపిన దినాలు అధ్యయనంలోనూ, ఆధ్యాత్మిక సాధనలతోనూ, మహదానందంగా గడిచాయి. కానీ దేశద్రిమ్మరులుగా పరివ్రాజక జీవితం గడపాలన్న కోరిక వారిలో పలువురిని ఆకర్షించసాగింది. నరేంద్రుడు కూడా 1888 చివరిభాగం నుంచి అనేకసార్లు మఠం విడిచి యాత్రలకు పోసాగాడు.

## పరివ్రాజక సన్న్యాసి

తాత్కాలికమైన యాత్రలు ప్రారంభించిన 1888 చివరిభాగం నుంచి 1890లో తన సోదరబృందాన్ని పూర్తిగా విడిచిపెట్టి ఊరూపేరూలేని బైరాగిగా పర్యటించడం ప్రారంభించినంతవరకూ జరిగిన కాలంలో నరేంద్రనాథుడి దృక్పథంలో గొప్పమార్పు వచ్చింది. భారతదేశపు జనసామాన్యంలో కలిసి పోవడానికి,

ఎవరూ తనను గుర్తుపట్టకుండా ఉండడానికి, రకరకాలపేర్లు పెట్టుకుంటూ ఆయన పర్యటించసాగారు.

ఈ సమయంలో ఒక భారతీయ సన్యాసిలాగా ఏకాంతజీవనం గడపాలనే సహజమైన కోరిక చెదిరిపోయి తానొక గొప్ప బాధ్యతను నెరవేర్చడానికి పుట్టానన్న భవిష్యత్‌జ్ఞానం ఆయనలో కలుగసాగింది. తనవొక్కడి సొంతముక్తికోసం వెంపర్లాడే మామూలు సాధువును కాదని ఆయనకు తేటతెల్లమయింది. భారతదేశాన్ని మరింత బాగా తెలుసుకోవాలన్న కోరిక రగులుతుండగా, అణగద్రొక్కబడిన భరతమాత మౌనరోదనల విన్నపాలు తనచుట్టూ పెల్లుబుకుతుండగా హిందువులకు పరమపవిత్రమైన వారణాసిని ముందుగా చేరుకున్నారు. అక్కడనుండి లక్నో, ఆగ్రా, బృందావనం, హత్రాస్, రిషికేశ్‌లకు పర్యటించి తిరిగి కొంతకాలంపాటు బారానగర్‌కు వచ్చారు. హత్రాస్‌లో తనకు ప్రథమ శిష్యుడై, స్వామి సదానందగా పేరొందిన శరత్‌చంద్ర గుప్తాను కలుసుకున్నారు. ఈ దేశాన్ని, ప్రపంచాన్ని ఆధ్యాత్మికంగా పునరుజ్జీవింపజెయ్యాలనే బృహత్ పథకాన్ని తనకు తన గురుదేవులు అప్పగించారని

అతనికి తెలిపారు. హత్రాస్‌లోని రైల్వేస్టేషనులో ఉద్యోగస్థుడైన శరత్ తన ఉద్యోగానికి రాజీనామాచేసి తన 'గురువు'యొక్క మహత్కార్యంలో సహాయ పడడానికి ఆయనను అనుసరించారు.

స్వామీజీ జీవితంలో ఒక ముఖ్యమైన సంఘటన 1890వ సంవత్సరంలో ఆయన ఘాజీపూర్‌లోని పవహారిబాబాను కలిసినప్పుడు జరిగింది. ఆయన యొక్క సాధుత్వానికి స్వామీజీ తన జీవితపర్యంతం గొప్ప ఆదరాన్ని చూపించారు. ఈ సమయంలో ఆయన అద్వైతపు అనంతనిశ్శబ్దంలో మునిగిపోవాలన్న కోరికకూ, మరొకప్రక్క తన గురుదేవుల మహత్కార్యానికి పరిపూర్ణత కలిగించాలన్న సంకల్పానికీ మధ్య మథనపడసాగారు. సర్వోత్కృష్టమైన సమాధిలో ఆ భగవంతుడిలో లీనమైపోవాలని తన హృదయంలో తొలుస్తున్న తపనను పవహారిబాబా ఉపశమింప జేయగలుగుతారని ఆయన భావించారు. ఈ ప్రబలమైన కోరిక తన గురుదేవులు తనకప్పగించిన బాధ్యతనుండి ఆయనను దూరంగా లాగివేయసాగింది. ఇరవైయొక్క రోజులపాటు ఆ ఆకర్షణకు లొంగిపోయే స్థితికి చేరినా

ప్రతిసారీ గురుదేవులు తన దర్శనం ద్వారా ఆయనను తిరిగి తన పనివైపు మరలించారు.

గురుదేవులు గతించిన తర్వాత యువసన్న్యాసులకు ఆధ్యాత్మిక మార్గదర్శిగా ఉన్న శ్రీశారదాదేవివద్ద స్వామీజీ సెలవు తీసుకున్నారు. అన్నిరకాల బంధాలనూ త్రెంచివేసి హిమాలయ పర్వతాల గంభీర ఏకాంతంలోకి పోవాలని తన సోదరసన్న్యాసులవద్ద కూడా సెలవు తీసుకున్నారు. ఇప్పుడు కొంతకాలం ఏకాంతంగా ఉండడం అత్యవసరంగా ఆయనకు తోచింది. రోమారోలా ఇలా వర్ణించారు: "ఇది ఒక మహాప్రస్థానం. ఒక గజఈతగానిలాగా ఆయన భారతదేశ మహాసాగరంలోనికి దుమికారు. ఆ మహాసాగరం ఆయన కాలిబాటల్ని కప్పివేసింది. దాని అలలలో తేలుతూ, అటూయిటూ కొట్టుకుపోతున్న జనసామాన్యంలోనూ, వేలమంది సన్న్యాసుల్లో తానూ ఒక అనామక సన్న్యాసిగానూ కలిసిపోయారు. కానీ ప్రజ్వరిల్లుతున్న మేధస్సు ఆయన కళ్ళల్లో కొట్టొచ్చినట్టు కనపడేది. ఎంత మారువేషం వేసినా రాజు రాజే!"

ఆయన పరివ్రాజక జీవితం ఆయనను చారిత్రకంగానూ, తీర్థయాత్రాస్థలాలుగానూ పేరొందిన రకరకాలచోట్లకు తీసుకుపోయింది. ఆయన ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, మైసూర్, కేరళ, మద్రాస్, హైదరాబాదులకు పర్యటించారు. ప్రతిచోటా రాజకీయ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగాలలో ప్రాచీన భారతదేశ ఔన్నత్యం ఆయనకు స్పష్టంగా గోచరించింది. ఈ మహాసంస్కృతికి మధ్య భారతదేశ జనసామాన్యం యొక్క కష్టాలు, కడగండ్లు ఆయన మనస్సును ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ఆయన ఒక రాజసంస్థానం నుండి మరొక రాజసంస్థానానికి తిరిగి, వారి కష్టాలను కడతేర్చే మార్గాలను అన్వేషించారు. ఆ విధంగా ఆయన పలు రాజసంస్థానాల పరిపాలకుల్ని, ప్రముఖవ్యక్తుల్ని కలుసుకున్నారు. వారిలో ఖేత్రీ మహారాజయిన అజిత్‌సింగ్ ఆయనకు ప్రాణస్నేహితుడు, శిష్యుడు అయ్యాడు. ఆల్వారులో స్వామీజీ 'పతంజలి మహాభాష్యాన్ని' అధ్యయనం చేశారు. పూనాలో గొప్ప జాతీయనాయకుడైన బాలగంగాధర్ తిలక్‌వద్ద అతిథిగా ఉన్నారు. మొదట తిలక్ స్వామీజీతో ఒకింత చులకనగా

మాట్లాడినా, స్వామీజీ జ్ఞానగంభీరతను, ఆలోచనా పరిపుష్టిని మెచ్చుకుని తన ఆతిధ్యాన్ని స్వీకరించవలసిందిగా ఆహ్వానించారు. అక్కడనుంచి బయలుదేరి, కొంతకాలం బెల్గాంలోవున్న తరువాత స్వామీజీ బెంగుళూరు, మైసూరులను దర్శించారు. పాశ్చాత్యదేశాలలో మన సనాతనధర్మాన్ని బోధించి, భారతదేశానికి కావలసిన ఆర్థికసహాయాన్ని కోరడానికి అవసరమైన ధనసహాయాన్ని తాను అందిస్తానని మైసూరు మహారాజు స్వామీజీకి వాగ్దానం చేశారు. మైసూరునుంచి స్వామీజీ త్రివేంద్రం, కన్యాకుమారి దర్శించారు.

స్వామీజీ ఎక్కడికి వెళ్ళినా, అక్కడి ప్రముఖప్రదేశాలు, వ్యక్తులు ఆయనను ఎక్కువగా ప్రభావితం చెయ్యలేదు. సామాన్య ప్రజానీకపు దుర్భరదారిద్ర్యం, బాధలు ఆయన హృదయాన్ని కలచివేశాయి. ఇంచుమించు మూడేళ్ళపాటు, తరచుగా కాలినడకన ప్రయాణించి, స్వామీజీ భారతదేశాన్ని తనకుతానుగా చూసి తెలుసుకున్నారు. ఇప్పుడు ఆయన

ఒక విధంగా తన ప్రయాణపు ముగింపుకు చేరుకున్నారు. గొప్ప ఉద్వేగంతో ఆయన కన్యాకుమారిలోని కుమారీదేవి విగ్రహం ముందు సాగిలపడ్డారు. ఆ తర్వాత సముద్రాన్ని ఈది, దక్షిణతీరంలో కొద్దిదూరంలో నీటిమధ్యవున్న ఒక కొండరాయిని చేరుకుని అక్కడ ఆ రాత్రంతా తీవ్రమైన ధ్యానంలో మునిగిపోయారు. తన ప్రయాణాలలో పొందిన అనుభూతులన్నీ ఒక సుదీర్ఘచిత్రంగా ఆయన మనోనేత్రం ముందు కదలాడాయి. భరతమాత యొక్క భూత, భవిష్యత్, వర్తమానాల గురించి, ఆమె అధఃపతనానికిగల కారణాలను గురించి, ఆమెను తిరిగి ఉద్ధరించేందుకు తగిన పద్ధతుల గురించి ఆయన ధ్యానం చేశారు. భారతదేశ పేదప్రజానీకానికి కావలసిన సహాయాన్ని కోరడానికి, తద్వారా తన జీవితపు మహత్కార్యానికి ఒక రూపునివ్వడానికి, పాశ్చాత్యదేశాలకు ప్రయాణించాలన్న అతిముఖ్యమైన నిర్ణయాన్ని ఆయన ఇక్కడే తీసుకున్నారు.

ఈ నిర్ణయంతో ఆయన రామేశ్వరం, మదురైలకు ప్రయాణమయ్యారు. అక్కడనుంచి ఆయన మద్రాసు

వెళ్ళారు. అక్కడ అలసింగ పెరుమాళ్ నాయకత్వంలో ఒక యువబృందం ఆయన రాకకోసం ఆతృతగా ఎదురుచూస్తున్నది. వారికి ఆయన, అమెరికావెళ్ళి అక్కడ చికాగోలో జరుగుతున్న సర్వమతమహాసభలో పాల్గొనాలన్న కోరికను బయటపెట్టారు. ఆ యువశిష్యులు ఆయన ప్రయాణ ఖర్చులకు అవసరమైన సొమ్మును పోగు చేశారు. కానీ ఆ జగన్మాత తన ప్రయాణానికి ఇచ్ఛగించిందో లేదో తెలియదన్న నెపంతో స్వామీజీ ఆ ధనాన్ని పేదలకు పంచిపెట్టమని చెప్పారు. ఈ తరుణంలో స్వామీజీ తన మనసులోమాట సరైనదేనన్నదానికి సంకేతంగా ఒక కలలో శ్రీరామకృష్ణులు సముద్రం మీదకు నడుస్తూ తననుకూడా రమ్మని సౌంజ్ఞ చేస్తున్నట్లు ఆయనకు కనిపించింది. దీనికితోడు శ్రీశారదాదేవి కూడా తన దీవెనలను, అంగీకారాన్ని తెలిపారు. శ్రీ శారదాదేవి కూడా ఒక కలలో శ్రీరామకృష్ణుల అంగీకారాన్ని పొందారు. దీనితో స్వామీజీ సందేహాలన్నీ తీరిపోయాయి. ఆయన ప్రయాణానికి అవసరమైన నిధులను సేకరించడానికి స్వామీజీ యువమిత్రులు మరలా ఉద్యమించారు.

ఆ తర్వాత ఆయన కొద్దిరోజులు హైద్రాబాదుకు వెళ్ళారు. అమెరికా ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లు ఆవిధంగా జరుగుతుండగా, అకస్మాత్తుగా ఖేత్రీమహారాజుకు కొడుకు పుట్టిన సందర్భంగా జరుగుతున్న వేడుకలకు రావలసిందిగా ఆయనకు ఆహ్వానం అందింది. స్వామీజీ తన శిష్యుడినుంచి అందిన ఈ ఆహ్వానాన్ని కాదనలేకపోయారు. మహారాజుగారు స్వామీజీని సాదరంగా ఆహ్వానించి ఆయన ప్రయాణానికి కావలసిన అన్ని ఏర్పాట్లనూ చేయిస్తానని మాట ఇచ్చారు. ఇక్కడే, మహారాజుగారి సలహామేరకు "వివేకానంద" అన్న పేరును పెట్టుకున్నారు. తాను మాట ఇచ్చినట్టుగానే మహారాజుగారు తన వ్యక్తిగత కార్యదర్శిని స్వామీజీతోపాటు పంపి, బొంబాయినుండి ఆయన ప్రయాణానికి అవసరమైన అన్ని ఏర్పాట్లనూ చేయించారు. అమెరికాకు స్వామీజీ 1893 మే 31వతేదీన బయలుదేరారు.

## ప్రపంచ వేదిక మీద

స్వామి వివేకానందులు చైనా, జపాన్, కెనడాల మీదుగా ప్రయాణించి చికాగో నగరానికి జులై మధ్యభాగంలో చేరుకున్నారు. కాంటన్‌లో ఆయన కొన్ని బౌద్ధవిహారాలను దర్శించారు. జపాన్ ప్రజల పారిశ్రామికప్రగతిని, పరిశుభ్రతను ఎంతగానో మెచ్చుకున్నారు. చికాగోలో ప్రజల కళ్ళు చెదిరే భోగభాగ్యాలను, కొత్తవిషయాలను కనిపెట్టే మేధాశక్తిని చూసి ఒక చిన్నపిల్లవాడిలాగా దిగ్భ్రమ చెందారు. విశ్వమత మహాసభ సెప్టెంబరు వరకూ ప్రారంభం కాదని, తగిన పరిచయపత్రాలు లేనిదే ఎవ్వరినీ అందులో పాల్గొనడానికి అనుమతించరనీ తెలుసుకుని నిరాశ చెందారు.

దారితప్పిపోయినట్టు తోచినా దేవుడిమీద భారంవేసి చికాగోకన్నా చౌకగా ఉండే బోస్టన్ నగరానికి వెళ్ళారు. తాను ప్రయాణించే రైలులో ఆయనకు మిస్ కాథరీన్ సాన్‌బర్న్‌తో పరిచయమయింది. ఆమె తన అతిథిగా ఉండడానికి స్వామీజీని ఆహ్వానించింది. ఆమె ద్వారా

స్వామీజీకి హార్వార్డ్ విశ్వవిద్యాలయ ఆచార్యులైన జాన్ హెన్రీ రైట్ మహాశయునితో పరిచయం కలిగింది. సర్వమత మహాసభ అధ్యక్షునికి స్వామీజీని గురించి ఒక పరిచయపత్రాన్ని డా. రైట్ ఇచ్చారు. అందులో ఒక వాక్యంగా, "విద్యాధికులైన మన ఆచార్యులందరినీ ఏకం చేసిన దానికన్నా ఎక్కువ జ్ఞానవంతుడైన మనిషి ఇక్కడ ఉన్నాడు", అని వ్రాశారు.

సర్వమత మహాసభ ప్రారంభానికి ఒకటి రెండురోజుల ముందు స్వామీజీ చికాగోకు తిరిగి వచ్చారు. కానీ ఆయన దిగులుకుతోడు ప్రాచ్యమతప్రతినిధులకు ఆతిధ్యాన్ని అందజేసే కమిటీ చిరునామాను పోగొట్టుకున్నారు. ఆ రాత్రి అక్కడి రైల్వేస్టేషనులో ఒక పెద్దపెట్టెలో తల దాచుకుని, మరునాటి ఉదయం తనకు సహాయం చెయ్యగల మనిషి దొరుకుతాడేమోనని బయలుదేరారు. కానీ శ్వేతజాతీయులుకానివారికి సహాయం అంతత్వరగా లభించదు. నిష్ఫలంగా చాలాసేపు అన్వేషించిన మీదట అలసిపోయి, అంతా దైవసంకల్పం మీద వదిలి రోడ్డుప్రక్కన చతికిలబడ్డారు. అకస్మాత్తుగా ఆయన

ఎదురుగానున్న ఇంటిలోనుంచి ఒక స్త్రీ ఆయన వద్దకు నడిచి వచ్చి ఆయనకు ఏ సహాయం కావాలని అడిగారు. ఆమెయే శ్రీమతి జార్జ్ డబ్ల్యూ. హేల్. వారింటి చిరునామాయే అమెరికాలో స్వామీజీ శాశ్వత విలాసంగా నిలిచిపోయింది. హేల్ కుటుంబీకులు స్వామీజీ భక్తులుగా మారిపోయారు.

సర్వమత మహాసభ 1893 సెప్టెంబరు 11వ తేదీన ప్రారంభమయింది. కళాసంస్థ (Art Institute) సభాప్రాంగణం సుమారు 7000మంది జనంతో కిటకిటలాడిపోయింది. వారు ఆదేశపు ఉత్కృష్ట సంస్కృతికి ప్రతినిధులు. వేదికమీద ప్రపంచం నలుమూలల నుంచీ విచ్చేసిన అన్నిమతాల ప్రతినిధులూ ఆశీనులయ్యారు. స్వామిజీ అటువంటి బ్రహ్మాండమైన, విశ్వవిఖ్యాతులైన వారితో నిండిన సభను ఉద్దేశించి ఎన్నడూ ప్రసంగించలేదు. ఆయన చాలా భయపడ్డారు. ఆయన తరుణం వచ్చినప్పుడు, మనస్సులో సరస్వతీదేవికి నమస్కరించి, "అమెరికాదేశపు సోదర సోదరీమణులారా!" అని

సంబోధించారు. వెనువెంటనే ఆ బ్రహ్మాండమైన సభలో కరతాళధ్వనులు మిన్నుముట్టాయి. పూర్తిగా రెండునిముషాలపాటు ఆ కరతాళాలు ఆగలేదు. "ఏడువేలమంది జనం లేచినిలబడి, తమకు అంతుబట్టనిదేదో ఒకదానికి నివాళులర్పించారు." ప్రజ్వరిల్లే చిత్తశుద్ధితో ఆయన పలికిన పలుకులు, తేజస్సుతో నిండిన ఆయన ముఖవర్చస్సు, కాషాయవస్త్రాలు వారిని ఎంతగా ఆకట్టుకున్నాయంటే మరుసటిరోజు వార్తాపత్రికలు స్వామీజీని సర్వమతమహాసభలో పాల్గొన్న ప్రతినిధులలో అత్యుత్తమునిగా కీర్తించాయి. భిక్షాపాత్రతో బయలుదేరిన ఒక సాధారణ సాధువు అందరి మనస్సులనూ దోచుకున్నవాడిగా ఎదిగిపోయాడు.

స్వామీజీ అటుపై ఆ మహాసభలో చేసిన ప్రసంగాలన్నిటినీ సభికులు గొప్ప గౌరవంతోనూ, ఆసక్తితోనూ విన్నారు. వాటన్నింటిలో విషయమూ - సార్వజనీనతే! సభలో మిగిలిన ప్రతినిధులు తమ మతాల గొప్పను గురించి మాట్లాడితే స్వామీజీ, ఆకాశమంత విశాలమైనదీ, సముద్రమంత లోతైనదీ అయిన మతాన్ని

గురించి మాట్లాడారు. మహాసభ ముగియడంతో స్వామీజీ అనామకజీవితం ముగిసిపోయింది. అటుపైన క్షణం తీరిక లేకుండా సంయుక్తరాష్ట్రాలలోని అన్ని ప్రదేశాలలోనూ ఆయన ఉపన్యసించవలసి వచ్చింది. ఒక ఉపన్యాస సంస్థతో ఒక ఉపన్యాస పర్యటన నిమిత్తం ఆయన ఒప్పందం కుదుర్చుకున్నారు. దానివల్ల స్వామీజీ నిరంతరం ప్రయాణిస్తూ అన్ని రకాల శ్రోతలనూ ఉద్దేశించి ప్రసంగించవలసి వచ్చింది. ఈ పర్యటన ఆయనకు పాశ్చాత్యజీవనంలోని వేర్వేరు అంశాలను ప్రత్యక్షంగా చూసి తెలుసుకునే అవకాశాన్ని కలిగించినా, ఆ సంస్థ స్వలాభానికి ఆయనను వాడుకుని, అవమానాల పాలుజేసింది. ఆయనకు వారి ప్రవర్తనతో రోతపుట్టి ఆ సంస్థతో తెగతెంపులు చేసుకున్నారు. అటుపై నిజమైన ఆసక్తి ఉన్న కొద్దిమంది అమెరికన్ భక్తులకు తరగతులు నిర్వహించారు. వారి నుంచి ఎటువంటి రుసుము వసూలు చెయ్యలేదు. ఆయన 1896 డిసెంబరు వరకూ పాశ్చాత్యదేశాలలో ఉన్నారు. ఆ కాలమంతా విపరీతమయిన పని ఒత్తిడితో గడిచింది. లెక్కలేనన్ని ఉపన్యాసాలు, తరగతులూ నిర్వహించడంతోపాటు

ఆయన న్యూయార్క్ నగరంలో ఒక వేదాంత సమాజాన్ని స్థాపించారు. సహస్రద్వీపవనంలో ఆయన కొద్దిమంది శిష్యులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. రాజయోగాన్ని రచించారు. రెండుసార్లు ఇంగ్లండ్‌కు విజయవంతంగా పర్యటించి, ఇప్పుడు జ్ఞానయోగంగా ప్రసిద్ధిపొందిన ఉపన్యాసాలను అక్కడే అందించారు. అక్కడ కొందరిని శిష్యులుగా చేసుకున్నారు. వారిలో ముఖ్యులు కెప్టెన్ సేవియర్ దంపతులు, సోదరి నివేదిత, ఇ.టి.స్టర్డీ మొదలైనవారు. అంతకు ముందు జె.జె.గుడ్విన్ అనే సంక్షిప్త లేఖకుడు (Stenographer) శిష్యుడయ్యాడు. ఈ పర్యటనలలోనే ఆయన మాక్స్ ముల్లర్ మహాశయుణ్ణి కలుసుకున్నారు. ఆయన యూరపుఖండాన్ని పర్యటిస్తున్నప్పుడు ప్రఖ్యాతజర్మన్ ప్రాచ్యతత్త్వవేత్త అయిన పాల్ డుస్సెన్‌ను కలుసుకున్నారు.

అన్నిమతాలకూ మూలమయిన సార్వజనీన సూత్రంగా వేదాంతాన్ని పాశ్చాత్యదేశాలలో బోధించడానికి ఆయన అమితమైన కృషిచేశారు. ఆయన ప్రయత్నాలవల్ల వేదాంత ఉద్యమం సంయుక్తరాష్ట్రాలలో

ఒక శాశ్వతప్రాతిపదికన వేళ్ళూనుకుంది. లండన్‌లో కూడా ఆయన పని కొంత పురోగతి సాధించింది. ఇక ఆయన జన్మభూమి ఆయనను ఎలుగెత్తి పిలువసాగింది. ఆయన సందేశాన్ని అందుకోవడానికి గొప్ప ఆతృతతో ఎదురుచూస్తోంది. అందువల్ల 1896 ఆఖరులో ఆయన లండన్ నుండి భారతదేశానికి బయలుదేరారు. తన పనిని కొనసాగించడానికి అమెరికా, ఇంగ్లండులలోని శిష్యులే కాకుండా తన సోదర సన్న్యాసులయిన శారదానంద, అభేదానంద స్వాములను కూడా వినియోగించారు.

## విజయుడై తిరిగి మాతృభూమికి

వివేకానంద స్వామి సేవియర్ దంపతులతో కలిసి 1896 డిసెంబర్ 16వ తేదీన లండన్ నగరాన్ని వదలి బయలుదేరారు. ఇటలీలోని రోమ్ తదితర ప్రదేశాలను సందర్శించిన తరువాత డిసెంబరు 30న నేపుల్స్‌లో భారతదేశానికి వెళ్ళే ఓడను ఎక్కారు. నేపుల్స్‌లో

జె.జె.గుడ్విన్ వారితో కలిశాడు. వారు 1897 జనవరి 15న కొలంబో చేరుకున్నారు. స్వామీజీ తిరిగి వస్తున్నారన్న వార్త అప్పుడే భారతదేశమంతా పాకిపోయింది. దేశమంతటా, అన్నిచోట్లా జనం స్వామీజీని ఆహ్వానించాలన్న ఆతృతతో ఎదురు చూడసాగారు. ఆయన ఇప్పుడు ఒక 'అనామక సన్న్యాసి' ఎంతమాత్రం కాదు. ప్రతి చిన్నాపెద్దా పట్టణంలోనూ ఆయన విజయానికి తగిన ఎదుర్కోలు. పలకడానికి ఆహ్వానసంఘాలు ఏర్పాటయ్యాయి. రోమారోలా ఇలా వర్ణించాడు: "అత్యుత్సాహంతో ఎదురుతెన్నులు చూస్తున్న జనబాహుళ్యానికి తన 'భారతదేశానికి సందేశం'తో, రాముడు, కృష్ణుడు, శివుడు పుట్టినగడ్డను పునరుజ్జీవింపచేసే శంఖారావంతో, ఆ జనుల ధీరశక్తినీ, అమర ఆత్మశక్తినీ ఎలుగెత్తి పిలుస్తూ, యుద్ధరంగానికి కదనుత్రొక్కమన్నారు. ఆయన ఒక సేనాధిపతి. తన 'ఉద్యమ ప్రణాళికను' వివరించి తన దేశప్రజలను ఒక్కుమ్మడిగా లేచిరమ్మని పిలుస్తూ, 'ఓ, నా భారత దేశమా! నీ ప్రాణశక్తి ఎక్కడుందో తెలుసా? మరణ మెరుగని నీ 'ఆత్మ'లోనే!" అని ఉద్బోధించారు.

మద్రాసులో ఆయన ఐదు ఉపన్యాసాలను ఇచ్చారు. బలహీనతలనూ, పిచ్చినమ్మకాలనూ పారద్రోలి ఒక కొత్తభారతాన్ని నిర్మించమని బోధించే తూర్యనాదాలు అవి. "ఈ దేశ జాతీయజీవన సంగీతానికంతటికీ మతమే జీవస్వరమని" ఆయన బోధించారు. ఆ మతం, 'ఈ విశ్వమంతా ఆ ఆత్మస్వరూపమే' అని బోధిస్తున్నదనీ, ఆ మతాన్ని బలోపేతం చేస్తే, మిగిలినవన్నీ వాటికవే చక్కబడతాయనీ బోధించారు. అయితే తన దేశప్రజల బలహీనతలను ఆయన విమర్శించకుండా ఉండలేదు. దేశప్రజలు గుడ్డిగా పాశ్చాత్య పద్ధతులను అనుకరించడాన్ని, పాతకాలపు పిచ్చిపిచ్చి నమ్మకాలని, కుల విభేదాలను ఆయన తూర్పారబట్టారు.

మద్రాసు నుంచి కలకత్తాకు ప్రయాణమై ఫిబ్రవరి 20కి అక్కడకు చేరుకున్నారు. సొంతవూరు ఆయనకు బ్రహ్మాండంగా స్వాగతం పలికింది. ఇక్కడే స్వామీజీ తన గురుదేవులకు ఘనంగా నివాళులర్పించారు: "ఆలోచనలలో, మాటలలో, చేతలలో నేను సాధించినదేమైనా ఉంటే, ఈ ప్రపంచంలో ఏ వొక్కరికైనా మేలుచేసే ఒక్కమాటైనా నా పెదవుల

మీంచి రాలివుంటే దానిలో నా గొప్పతనమేమీలేదు. అది ఆయనదే! నా మాటగా గుర్తుంచుకోండి! ఈ దేశం బాగుపడదలుచుకుంటే ఆయన పేరును ఆశ్రయించవలసిందే!"

తన మహత్కార్యాన్ని ఒక గట్టిపునాదిపైన స్థిరపరచడానికి స్వామీజీ సన్న్యాస, గృహస్థ శిష్యులందరినీ శ్రీబలరాంబోసుగారి ఇంటిలో ఏర్పాటు చేయబడ్డ సమావేశానికి రమ్మని కబురు పెట్టారు. ఆ విధంగా రామకృష్ణ మిషన్ మే, 1897లో ఏర్పాటయింది. స్వామీజీ మిషన్‌కోసం ప్రతిపాదించిన లక్ష్యాలు, ఆదర్శాలు పూర్తిగా ఆధ్యాత్మికమైనవి, మానవసేవకు ఉద్దేశించినవి. ఆయన తన భావాలకు కార్యరూపాన్ని ఇవ్వడానికి ఆ విధంగా ఒక యంత్రాంగాన్ని ప్రారంభించారు.

కలకత్తా నగరంలో 1898వ సంవత్సరంలో ప్లేగువ్యాధి ప్రబలినప్పుడు సన్న్యాసుల, గృహస్థ భక్తుల సహాయంతో స్వామీజీ సహాయకార్యక్రమాలను ప్రారంభించారు. ప్లేగువ్యాధి అదుపులోకి వచ్చిన

తర్వాత స్వామీజీ తమ పాశ్చాత్యశిష్యులతో కలిసి నైనిటాల్, ఆల్మోరాలను దర్శించడానికి వెళ్ళారు. ఆ పాశ్చాత్యశిష్యులకు, ముఖ్యంగా సోదరి నివేదితకు, ఈ కాలంలో మంచి శిక్షణ లభించింది. జూన్ 16న స్వామీజీ వీరిలో కొందరు శిష్యులతో కాశ్మీరు వెళ్ళారు. ఈ కాశ్మీరు పర్యటన స్వామీజీకి, వారి శిష్యులకు ఒక మరుపురాని అనుభూతి. జులై చివరలో స్వామీజీ, సోదరి నివేదితతో కలిసి 'అమరనాథ్'కు వెళ్ళారు. సాంప్రదాయబద్ధంగా అనుసరించాల్సిన ప్రతి చిన్న విషయాన్నీ తుచ తప్పక అనుసరిస్తూ, వంటికి బూడిద పులుముకుని, గోచీ మాత్రమే ధరించి ఆగస్టు 2న అమరనాథ్ గుహకు చేరుకున్నారు. ఆయన శరీరం మొత్తం దివ్యావేశంతో కంపించిపోసాగింది. ఒక గొప్ప యోగానుభూతి ఆయనకు కలిగింది.

శివుడే తనకు స్వయంగా దర్శనమిచ్చాడన్న దానికన్నా ఆ అనుభూతి గురించి స్వామిజీ ఎవ్వరికీ ఏమీ చెప్పలేదు. దీని తర్వాత శ్రీనగర్‌కు కొంతదూరంలో ఉన్న క్షీరభవాని మాత మందిరానికి స్వామీజీ ఒంటరిగా వెళ్ళారు. అదికూడా స్వామీజీకి ఒక

మరువలేని అనుభూతి. ఆయన ఆ జగన్మాతలో పూర్తిగా లీనమైపోయారు. తాను వ్రాసిన కవితనే ఉదహరిస్తూ ఆయన ఇలా వర్ణించారు: "అదంతా నిజమే అందులో ప్రతి పదమూ సత్యమే. నేనే దాన్ని నిరూపించాను. ఎందుకంటే ఆ మృత్యురూపాన్ని ప్రత్యక్షంగా ఆలింగనం చేసుకున్నాను గనుక."

అక్టోబరు 18కి ఆయన కలకత్తా చేరుకునేసరికి ఆయన పాలిపోయి, బాగా బలహీనపడి రకరకాల వ్యాధులతో బాధపడుతున్నారు. అయినప్పటికీ ఆయన అనేక పనులలో నిమగ్నమయ్యారు. గంగానది పడమరగట్టుమీద కలకత్తా నుండి ఐదు మైళ్ళదూరంలో బేలూరు అనేచోట కొంతభూమిని కొని అక్కడ మఠనిర్మాణం ప్రారంభించారు. 1899 జనవరిలో సన్న్యాసులు ఆ కొత్త మఠంలోకి మారారు. ఇప్పుడదది బేలూరుమఠంగా ప్రసిద్ధి పొందింది. అంతకు కొంతకాలం మునుపే 'నివేదిత బాలికల పాఠశాల' ప్రారంభోత్సవం జరిగింది. ఇదే సమయంలో బెంగాలీ మాసపత్రిక 'ఉద్బోధన్'ను ప్రారంభించారు. హిమాలయాలలో ఒక మఠాన్ని ప్రారంభించాలన్న స్వామీజీ చిరకాల స్వప్నాన్ని

సేవియర్ దంపతులు మాయావతి (ఆల్మోరా)లో అద్వైత ఆశ్రమాన్ని నిర్మించడం ద్వారా సఫలీకృతం చేశారు. ఆంగ్లమాసపత్రిక అయిన ప్రబుద్ధభారత అంతకుముందే మద్రాసులో ప్రారంభమయింది. కానీ దాని సంపాదకులు 1898లో అకాలమృత్యువు పాలవడంతో ఒకనెల దాని ప్రచురణ ఆగిపోయింది. ఆ మాసపత్రికను స్వామీజీ శిష్యులయిన స్వరూపానంద స్వామి సంపాదకత్వంలో ఆల్మోరాలో మళ్ళీ ప్రారంభించారు. 1899లో దాన్ని మాయావతి లోని అద్వైత ఆశ్రమానికి మార్చారు.

ఈ కాలంలో అక్కడి సన్న్యాసులనూ, బ్రహ్మచారులనూ నిరంతరం ఉత్తేజపరుస్తూ, తీవ్రమైన ఆధ్యాత్మికతతోనూ, సేవతోనూ నిండిన జీవనంవైపు వారిని పురికొల్పారు. ఆయన మాటలలోనే చెప్పినట్టుగా, 'ఆత్మనోమోక్షార్థం జగద్ధితాయచ' - 'తన స్వంత మోక్షానికి - జగతికి సేవచెయ్యడానికి' - అన్న జీవితాదర్శాన్ని వారి ముందుంచారు.

కానీ స్వామీజీ ఆరోగ్యం రోజురోజుకీ దిగజారుతున్నది. ఇంకొకసారి పాశ్చాత్య దేశాలకు

పర్యటించాలని ఆయన అనుకున్నారు. దానివల్లనైనా ఆయన ఆరోగ్యం బాగుపడవచ్చునన్న ఆశతో సోదర సన్యాసులు ఆయన నిర్ణయాన్ని సమర్థించారు.

## ప్రపంచాన్ని చుట్టి మరొకసారి

తురీయానందస్వామిని, సోదరి నివేదితను వెంట తీసుకుని 1899 జూన్ 20న వివేకానందస్వామి భారతదేశాన్ని వదిలి ప్రయాణమయ్యారు. స్వామీజీతో ప్రయాణం వారిరువురికీ గొప్ప శిక్షణా కార్యక్రమంగా రూపొందింది. సోదరి నివేదిత వారి ప్రయాణాన్ని ఇలా వర్ణించారు: "మొదటి నుంచీ చివరివరకూ రకరకాల కథల సజీవస్రవంతి ప్రవహించింది. ఏ క్షణంలో ఆయనలోని అంతర్ జ్ఞానజ్యోతి మెరిసి, ఏ కొత్త సత్యాన్ని ఖంగుమనే ఆయన కంఠస్వరంలో వినిపిస్తుందో అన్నది ఎవరికీ తెలియదు." మార్గమధ్యంలో మద్రాసు, కొలంబో, ఆడెన్, మార్సెల్స్ మొదలైన ప్రదేశాలను తాకి, వారి ఓడ జులై 31కి

లండన్ చేరింది. ఈ ప్రయాణంవల్ల స్వామీజీ ఆరోగ్యం మెరుగుపడింది.

రెండువారాలు లండన్‌లో గడిపి, స్వామీజీ న్యూయార్క్‌కు ఓడలో ప్రయాణమయ్యారు. అక్కడ శ్రీ లెగ్గెట్ దంపతులతో కలసి హడ్సన్ నదీతీరంలో, రిడ్జిలీమానర్ అనే సుందరప్రదేశంలో ఉన్న వారి గ్రామీణకుటీరానికి వెళ్ళారు. నవంబర్ 5వ తేదీ వరకు స్వామీజీ ఆ ఏకాంతప్రదేశంలో గడిపారు. ఆ తర్వాత పశ్చిమ తీరానికి ప్రయాణమయ్యారు. లాస్ ఏంజిలిస్, ఓక్‌లాండ్, శాన్‌ఫ్రాన్సిస్కోలకు వెళ్ళారు. మధ్యలో కొద్దిరోజులు చికాగో, డెట్రాయిట్‌లకు కూడా పర్యటించారు. తూర్పుపశ్చిమాలు పరస్పరం సహకారం అందించుకోవడం ద్వారా మాత్రమే మరింత శక్తిమంతంగా ఎదగగలవన్న నమ్మకం ఇప్పుడు స్వామీజీకి దృఢపడింది. పాశ్చాత్యదేశాల భోగభాగ్యాల వెలుగుజిలుగులు ఆయన కళ్ళకు మిరుమిట్లుగొల్పలేదు. అదే విధంగా భారతదేశంలో ఆధ్యాత్మికతకు ఇచ్చే ప్రాధాన్యత, అక్కడి సామాజిక, ఆర్థిక

వెనుకబాటుతనాన్ని ఆయనకు కనబడకుండా దాచలేక పోయింది.

స్వామీజీ నివేదితతో ఇలా చెప్పారు: "పడమటి దేశాలలో సామాజికజీవనం పైపైన నవ్వుల పువ్వుల్ని పూయిస్తుంది కానీ వాటి క్రింద అది ఏడ్పులతో మొదలై వెక్కిళ్ళతో అంతమవుతుంది... కానీ ఇక్కడ భారతదేశంలో పైపొర చీకట్లు క్రమ్ముకుని, చింతలతో నిండినట్లు కనిపించినా దాని క్రింద నిర్లక్ష్యం, ఉల్లాసం నిండివుంటాయి." పాశ్చాత్యసమాజం బయటిప్రకృతిని జయించడానికి ప్రయత్నిస్తే, ప్రాచ్యసమాజం లోపలిప్రకృతిని జయించడానికి ప్రయత్నించింది. ఇప్పుడు, వారివారి ప్రత్యేకతలను నాశనం చేసుకోకుండా, చేయిచేయి కలిపి, ఒండొరుల మంచి కోసం ప్రాక్పశ్చిమాలు పనిచేసి తీరవలసిన సమయం ఆసన్నమైంది. పడమరదేశాలు తూర్పునుంచి నేర్చుకోవలసింది ఎంతో ఉంది; అదే విధంగా, తూర్పు పడమర నుంచి నేర్చుకోవలసింది ఎంతో ఉంది; నిజానికి ఈ రెండింటి ఆదర్శాలను తగిన విధంగా కలబోయడం ద్వారా మాత్రమే ఉజ్జ్వలభవిష్యత్తుకు

రూపుదిద్దగలం. అప్పుడు తూర్పుపడమరలు మిగలవు - మానవజాతి ఒక్కటే మిగులుతుంది.

ఈకాలంలో జరిగిన ఒక ముఖ్యమైన సంఘటన ఉత్తర కాలిఫోర్నియాలో శాంతి ఆశ్రమ ప్రారంభం. తురీయానంద స్వామిని దానికి నాయకుణ్ణి చేశారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో కూడా ఒక వేదాంతకేంద్రం ప్రారంభించబడింది. ఈ మధ్యకాలంలోనే స్వామీజీ పశ్చిమ అమెరికా నగరాలలో అనేక ఉపన్యాసాలిచ్చారు. కానీ స్వామీజీకి దగ్గరపడుతున్న తమ అంత్యకాలం మరింత స్పష్టంగా కనపడసాగింది. ఆయన మిస్ మాక్లౌడ్‌కు ఇలా వ్రాశారు: "ఆ ప్రశాంతతీరానికి నా నావ చేరుతున్నది. అక్కడ నుంచీ మళ్ళీ అది బయలుదేరదు!"

అంతర్జాతీయ సదస్సు సందర్భంగా పారిస్‌లో జరుగుతున్న మతచరిత్ర సభలలో పాల్గొనడానికి స్వామీజీ 1900 ఆగస్టు 1న విచ్చేశారు. కొందరు స్నేహితులతో కలిసి ఆయన అక్టోబరులో పారిస్ వదిలి హంగెరీ, రుమేనియా, సెర్బియా, బల్గేరియాలను

దర్శించి చివరిగా కాన్‌స్టాంటినోపుల్ చేరుకున్నారు. అక్కడ నుండి ఏథెన్స్ మీదుగా కైరో చేరుకున్నారు. కైరోలో స్వామీజీకి అకస్మాత్తుగా భారతదేశానికి వెళ్ళిపోవాలనిపించింది. కెప్టెన్ సెవియర్ మరణించి ఉండవచ్చునని ఆయనకు మనస్సులో తోచింది. అక్కడనుంచి బయలుదేరే మొదటిఓడలో ఎక్కి స్వామీజీ వేగంగా భారతదేశానికి చేరుకుని 1900 డిసెంబరు 9న బేలూరుమఠం చేరుకున్నారు. తన రాక గురించి వాళ్ళకి ముందుగా తెల్పలేదు. అకస్మాత్తుగా ఆయన అలా రావడం సోదర సన్న్యాసులకు, శిష్యులకు పట్టలేని ఆనందాన్ని కలిగించింది.

## గమ్యం చేరిన పయనం

కెప్టెన్ సెవియర్ అక్టోబరు 28న మరణించారన్న దుర్వార్త స్వామీజీకి మఠంలో తెలిపారు. శ్రీమతి సేవియర్‌ను ఓదార్చడానికి ఆయన వెంటనే మాయావతికి బయలుదేరి వెళ్ళారు. అక్కడికి 1901

జనవరి 3న చేరుకుని పదిహేనురోజులపాటు అక్కడే గడిపారు. 'అద్వైతాని'కి అంకితం చెయ్యబడిన ఈ హిమాలయాశ్రమంలోని దృశ్యసౌందర్యం ఆయనను ముగ్ధుణ్ణి చేసింది. తన అనారోగ్యాన్ని, తీవ్రమైన చలిని లెక్కచెయ్యకుండా ఆయన అక్కడి చెట్లలోనూ, కొలనుచుట్టూ చీకుచింతా లేకుండా, ఆనందంగా విహరించారు.

బేలూరుకు .తిరిగివచ్చి ఏడువారాలపాటు అక్కడే ఉన్నారు. ఆ తర్వాత తూర్పు బెంగాలుకు, అస్సాంకు ప్రయాణమయ్యారు. ఆయాచోట్ల ఉన్న తీర్థప్రదేశాలను దర్శించాలని స్వామీజీ తల్లి భువనేశ్వరీదేవి కోరారు. స్వామీజీ మిసెస్ బుల్‌కు వ్రాసిన ఉత్తరంలో, "ప్రతి హిందూ వితంతువుకూ ఉండే కోరిక ఇది. నావారికి నేనన్నివిధాలా బాధల్నే తెచ్చిపెట్టాను. ఆమెకున్న ఈ ఒక్క కోరికనీ తీర్చడానికి ప్రయత్నిస్తున్నాను." నంగల్‌బంధ్, కామాఖ్య, షిల్లాంగ్ మొదలైన ప్రదేశాలను సందర్శించి, ఢాకాలోనూ, షిల్లాంగ్‌లోనూ కొన్ని

ఉపన్యాసాలు ఇచ్చిన తర్వాత స్వామీజీ 1901 మే రెండవవారంలో మఠానికి తిరిగి వచ్చారు.

ఇక స్వామీజీ మఠంలో ఎటువంటి చీకుచింతాలేని జీవితం గడపడానికి ప్రయత్నించారు. కొన్నిసార్లు గోచీ మాత్రమే ధరించి మఠమైదానాల్లో విహరించేవారు; వంటపనుల మీద అజమాయిషీ చేసేవారు; సన్న్యాసులతో కలిసి భక్తిగీతాలు పాడేవారు. కొన్నిసార్లు సందర్శకులకు ఆధ్యాత్మిక విషయాలు బోధిస్తూ, కొన్నిసార్లు తన గదిలో అధ్యయనంలో మునిగిపోయి, కొన్నిసార్లు సన్న్యాసులకు శాస్త్రాలలోని సూక్ష్మవిషయాలను బోధిస్తూ, తన భవిష్యత్ కార్యప్రణాళికలను వివరిస్తూ కనిపించేవారు. అంతవరకూ తన పేరుమీద ఉన్న బేలూరుమఠ ఆస్తులన్నింటినీ తన సోదర సన్న్యాసుల పేర బదిలీ చేసి తన బాధ్యతలను పూర్తిగా తొలగించుకున్నారు.

జపాన్ నుండి ఇద్దరు బౌద్ధభిక్షువులు 1901 సంవత్సరాంతంలో వచ్చి జపాన్‌లో త్వరలో జరగబోతున్న మతసభలకు విచ్చేయమని కోరారు. వారి

ఆహ్వానాన్ని మన్నించలేకపోయినా, వారితోపాటు బోధగయకు, వారణాసికి వెళ్ళారు. వారణాసిలో కొద్దిమంది యువకులు తన సందేశపు స్ఫూర్తితో పేదలకు వైద్యసహాయం అందించడం చూసి అమితంగా సంతోషించారు. వారు ప్రారంభించిన పని వారణాసిలో ఏర్పడిన రామకృష్ణమిషన్ సేవాసంస్థకు విత్తనం నాటింది.

తన అంత్యకాలం సమీపించిందని స్వామీజీకి తెలుసు. తమ ఆఖరిరోజులలో స్వామీజీ చేసిన పనులన్నీ కావాలని చేసినవే. వాటికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. పెద్దచెట్టు నీడలో చిన్నచిన్న మొక్కలు పెరగవని ఆయన చెప్పేవారు. 1902 జులై 4వ తేదీన ఆయన ఉదయం 8 నుంచి 11 వరకూ ధ్యానం చేశారు. ఆ రోజు మధ్యాహ్నం ప్రేమానందస్వామితో కలిసి వాహ్యాళిగా నడిచి, ఒక వేదపాఠశాలను ప్రారంభించాలన్న తన ఆలోచనను ఆయనకు వివరించారు. సాయంత్రం తన గదిలో ఒక గంటసేపు ధ్యానం చేశారు. కొంతసేపు విశ్రాంతిగా పడుకున్నారు. ఆతర్వాత కొంతసేపటికి

రెండుసార్లు నిండుగా శ్వాసతీసుకుని మహాసమాధిలోకి ప్రవేశించారు.

ఆయన తన భౌతికశరీరాన్ని త్యజించి ఉండవచ్చుగాక, కానీ ఆయన 1896లో శ్రీ ఎరిక్ హామ్మండ్‌తో లండన్‌లో చెప్పిన మాటలు స్వామీజీ అమరుడన్న ఊరటను మనకందరికీ కలిగిస్తాయి. "నా శరీరాన్ని ఒక చింకిపాతలాగా విసిరేసి బయటికిపోవడమే మంచిదని నాకు అనిపిస్తూ ఉండవచ్చు గాక! కానీ నేను పనిచెయ్యడం మానను! తానే దైవాన్నని ఈ ప్రపంచం తెలుసుకునేంతవరకూ ప్రతి ఒక్కరికీ నేను ప్రేరణ కలిగిస్తూనే ఉంటాను".



# స్వామి వివేకానంద సందేశం

# నిజమైన విద్య

మనిషిలో ముందుగానే ఉన్న పరిపూర్ణతకు ఒక రూపాన్ని ఇచ్చేదే విద్య.

⊙ ⊙ ⊙ ⊙ ⊙

ఎంతోకొంత మెదడులోకి దట్టించుకుని, అది ఎప్పటికీ జీర్ణంకాక, జీవితమంతా గందరగోళాన్ని సృష్టించే సమాచారం విద్య అని అనిపించుకోదు. జీవంపోసే, పౌరుషంగల మనుష్యుల్ని తయారుచేసే, శీలాన్ని నిర్మించే ఆలోచనలను మనం ఆకళింపు చేసుకోవాలి. మీరు అటువంటి ఐదు ఆలోచనలను ఆకళింపు చేసుకుని, వాటినే మీ జీవితంగా, శీలంగా మలచుకుంటే ఒక గ్రంథాలయం మొత్తాన్ని కంఠస్థం చేసినవాడికన్నా మీకు ఎక్కువ విద్య అబ్బిందని చెప్పవచ్చు.

⊙ ⊙ ⊙ ⊙ ⊙

మంచి శీలాన్ని నిర్మించి, మానసిక బలాన్ని పెంచి, బుద్ధిని వికసింపజేసి, మనిషిని తన కాళ్ళమీద తాను నిలబడేలా చేసేదే విద్య.

⊙ ⊙ ⊙ ⊙ ⊙

నా ఉద్దేశ్యంలో విద్యలోని సారమంతా మనస్సును ఏకాగ్రం చెయ్యడంలోనే ఉందికానీ, విషయాల్ని కంఠస్థం చెయ్యడంలో కాదు. నేను మళ్ళీ విద్యాభ్యాసం చెయ్యవలసి వస్తే, ఎలా చదువుకోవాలో నన్నే నిర్ణయించుకోమంటే, నిజాల్ని ఎంతమాత్రం చదవను. ముందు ఏకాగ్రతాశక్తిని, వైరాగ్యాన్ని పెంపొందించుకుంటాను. అలా తయారయిన పరిపూర్ణమైన పనిముట్టుతో (మనస్సు అనే అంతఃకరణంతో) నా ఇష్టప్రకారం నిజాల్ని సేకరించుకోగలుగుతాను.

⊙ ⊙ ⊙ ⊙ ⊙

మనకిప్పుడు కావలసినదేమంటే వేదాంతంతో జతగూడిన పాశ్చాత్య శాస్త్రవిజ్ఞానం, దాన్ని దారిలోపెట్టే దీక్షానినాదంగా బ్రహ్మచర్యం, వాటితో పాటు శ్రద్ధ, ఆత్మవిశ్వాసం.

⊙ ⊙ ⊙ ⊙ ⊙

చూశారా! కేవలం కఠినమైన బ్రహ్మచర్యాన్ని అవలంబించడం ద్వారా కొద్దికాలంలోనే విద్యనంతా మనవశం చేసుకోవచ్చు. ఒక్కసారి విన్నా, తెలుసుకున్నా చాలు; దాన్ని ఎన్నటికీ మర్చిపోని జ్ఞాపకశక్తి మనిషికి కలుగుతుంది. ఈ బ్రహ్మచర్యం లేకపోవడంవల్లనే మనదేశంలో అన్నీ వినాశనపుటంచులకు చేరుకున్నాయి.

⊙ ⊙ ⊙ ⊙ ⊙

## శీలాన్ని నిర్మించేదెలా?

ఒక మనిషి శీలం నిజంగా ఎటువంటిదో మీరు నిర్ణయించాలంటే, అతడు చేసిన గొప్పగొప్ప పనుల్ని చూడవద్దు. ఏ తెలివితక్కువ వాడైనా ఏదోఒక రోజున గొప్ప ధీరుడైపోవచ్చు. (అలాకాక) అతడు చేసే సర్వసాధారణమైన పనుల్ని చూడండి. నిజంగా అవే ఒక గొప్పమనిషి యొక్క నిజమైన శీలాన్ని గురించి చెపుతాయి.

⊙ ⊙ ⊙ ⊙ ⊙

ధనంవల్ల, పేరుప్రతిష్ఠలవల్ల, విద్యవల్ల ఎటువంటి ప్రయోజనం లేదు. మంచిశీలం మాత్రమే దుస్సాధ్యమైన కష్టాల అడ్డుగోడల్ని పగులగొట్టుకుని ముందుకు చొచ్చుకుపోతుంది.

⊙ ⊙ ⊙ ⊙ ⊙

ఏదోవొక ఆదర్శాన్ని కలిగివున్న వ్యక్తి వెయ్యి పొరపాట్లు చేస్తే, ఏ ఆదర్శమూ లేనివాడు యాభైవేల పొరపాట్లు చేస్తాడని నేను గట్టిగా నమ్ముతున్నాను. కాబట్టి, ఒక ఆదర్శాన్ని కలిగివుండడం మంచిది.

⊙ ⊙ ⊙ ⊙ ⊙

కాబట్టి, లేచి నిలబడి, ధైర్యంగా, బలంగా ఉండండి. బాధ్యత మొత్తాన్ని మీ భుజాలమీదే వేసుకోండి. మీ తలరాతకు సృష్టికర్తలు మీరేనని తెలుసుకోండి.

⊙ ⊙ ⊙ ⊙ ⊙

ఒక మనిషి నిరంతరం చెడ్డమాటలు వింటూ, చెడ్డ ఆలోచనలు చేస్తూ ఉంటే అతని మనస్సంతా చెడ్డ

ముద్రలతో నిండిపోతుంది. ఆ విషయం అతనికి తెలియకుండానే అవి అతడి ఆలోచనలను, పనులను ప్రభావితం చేస్తాయి. వాటి చేతులలో అతడు కీలుబొమ్మగా మారతాడు. అవి అతడిచేత బలవంతంగా చెడు చేయిస్తాయి. అతడు చెడ్డవాడయిపోతాడు. తనను తాను మార్చుకోలేడు. అదే విధంగా ఒక మనిషి మంచి ఆలోచనలు, మంచిపనులు చేస్తూ ఉంటే వాటి ముద్రల మొత్తం ఇంతకు ముందు చెప్పుకున్నట్టుగా, తనకు తెలియకుండానే అతడిచేత బలవంతంగా మంచి చేయిస్తాయి. అలా జరిగినప్పుడు ఆ వ్యక్తి యొక్క మంచిశీలం(సచ్ఛీలం) సుస్థిరమైందని చెప్పబడుతుంది.

⊙ ⊙ ⊙ ⊙ ⊙

## భారత యువజనులారా! లేవండి!

లేవండి! మేల్కోండి! మీ దేశానికి ఈ గొప్పత్యాగం అవసరం. యువకులే ఆ త్యాగాన్ని చెయ్యగలరు. "యువకులు, శక్తిమంతులు, బలవంతులు, దృఢమైన

శరీరం కలవారు, బుద్ధిమంతులు" - ఈ పని చెయ్యవలసింది వీరే.

⊙ ⊙ ⊙ ⊙ ⊙

లక్షలాది ప్రజలు ఆకలితో, అజ్ఞానంతో జీవిస్తున్నంత కాలం, వారి ధనంతో విద్యనేర్చి, వారి గోడు కొంచెమైనా పట్టించుకోని ప్రతి ఒక్కణ్ణీ నేను ద్రోహి అని (విశ్వాసఘాతకుడని, మోసగాడని) అంటాను.

⊙ ⊙ ⊙ ⊙ ⊙

చచ్చేవరకూ పని చెయ్యండి. నేను మీతోనే ఉన్నాను. నేను పోయిన తర్వాత నా ఆత్మ మీతో పనిచేస్తుంది! ఈ జన్మ వస్తుంది, పోతుంది. సంపదలు, పేరుప్రతిష్ఠలు, సుఖభోగాలు - ఇవన్నీ మూన్నాళ్ళ ముచ్చటలే. ప్రాపంచిక విషయాలలో కొట్టుకునే పురుగుల్లా చావడంకంటే, సత్యాన్ని బోధిస్తూ, బాధ్యతను నెరవేరుస్తూ మరణించడం చాలా, చాలా మేలు.

⊙ ⊙ ⊙ ⊙ ⊙

నాయనా! నాకు కావలసింది ఇనుప కండరాలు, ఉక్కునరాలు, వాటిలో పిడుగులాంటి పదార్థంతో తయారైన మనస్సు. బలము, పౌరుషము, క్షాత్రవీర్యము + బ్రహ్మతేజము.

⊛ ⊛ ⊛ ⊛ ⊛

ఆధునికతరం మీద, యువతరం మీదనే నా విశ్వాసం. వారిలోనుండే నా కార్యకర్తలు వస్తారు. వాళ్ళు ఈ సమస్య మొత్తాన్ని సింహాలలాగా సరిదిద్దుతారు.

⊛ ⊛ ⊛ ⊛ ⊛

## మానవుణ్ణే మాధవుడుగా సేవించండి!

పూజలన్నింటి సారాంశం ఇదే - మనం పవిత్రంగా ఉండడం, ఇతరులకు మంచి చెయ్యడం. ఎవడైతే పేదవాడిలో, బలహీనుడిలో, రోగిలో శివుణ్ణి చూడగలుగుతాడో అతడే నిజంగా శివుణ్ణి అర్చిస్తాడు; ఎవడైతే విగ్రహంలో మాత్రమే శివుణ్ణి చూస్తాడో, అతడి ఆరాధన ఇంకా ప్రాథమికమైనదే.

❂ ❂ ❂ ❂ ❂

ఈ జీవితం క్షణికం! ఈ ప్రపంచంలో మన గొప్పలన్నీ మూన్నాళ్ళముచ్చటే! కానీ ఎవరైతే పరులకోసం జీవిస్తారో వాళ్ళే నిజంగా సజీవులు. మిగిలిన వాళ్ళు బ్రతికున్నా చచ్చినట్టే లెక్క!

❂ ❂ ❂ ❂ ❂

పరులసేవలో తమ శరీరాల్ని బుగ్గిచేసుకున్నవారే ధన్యజీవులు.

❂ ❂ ❂ ❂ ❂

భగవంతుడేగనుక మిమ్మల్ని తన సంతానంలో ఏవొక్కరికైనా సహాయపడేటట్లు అనుగ్రహిస్తే మీరు ధన్యజీవులు! అంతే! మీ గురించి మీరే ఎక్కువగా ఊహించుకోకండి. ఆ గొప్పదనం ఇతరులకు కాకుండా మీకు ఆపాదించబడడం మీ మహద్భాగ్యం. (కనుక) దాన్ని ఒక ఆరాధనగా చెయ్యండి.

❂ ❂ ❂ ❂ ❂

పేదలకోసం ఎవరి హృదయం ద్రవిస్తుందో అతణ్డే నేను మహాత్ముడని అంటాను. లేకపోతే అతడు దురాత్ముడే.

⊛ ⊛ ⊛ ⊛ ⊛

మీరు మీ శరీరాన్ని, మనస్సుని, వాక్కుని ప్రపంచ సంక్షేమానికి (బహుజన హితాయ) ధారపొయ్యాలి. మీరు, "మాతృదేవోభవ, పితృదేవోభవ - మీ తల్లిని దేవునిగా చూడండి! తండ్రిని దేవునిగా చూడండి!" అని చదువుకున్నారు. కానీ నేను చెప్పేదేమంటే, "దరిద్ర దేవోభవ, మూర్ఖదేవోభవ - పేదల్ని, నిరక్షరాస్యుల్ని, అజ్ఞానుల్ని, బాధితుల్ని మీ దేవుళ్ళుగా చేసుకోండి!" వీరికి సేవ చెయ్యడమే అత్యున్నతమైన మతధర్మమని తెలుసుకోండి.

⊛ ⊛ ⊛ ⊛ ⊛

ఎంతో తపస్సు చేసిన తర్వాత నేను దీన్ని నిజమైన సత్యంగా తెలుసుకున్నాను - ప్రతిజీవిలోనూ దేవుడున్నాడు. ఇంతకన్నా వేరే దేవుడెవ్వడూ లేడు. "ఎవడు జీవారాధకుడో, వాడే దైవారాధకుడు!"

# ఆత్మ విశ్వాసం

తనమీద తనకు నమ్మకం లేనివాడే నాస్తికుడు. దేవుణ్ణి నమ్మనివాడు నాస్తికుడని పాతమతాలు చెప్పాయి. తనమీద తనకే నమ్మకం లేనివాడు నాస్తికుడని ఈ కొత్తమతం బోధిస్తోంది.

⊛ ⊛ ⊛ ⊛ ⊛

విశ్వాసం, విశ్వాసం, మనమీద మనకే విశ్వాసం; విశ్వాసం, దేవునిమీద విశ్వాసం - ఇదే గొప్పతనంలోని రహస్యం. మీ పురాణాలు వర్ణించిన ముప్పైమూడు కోట్లమంది దేవతలమీద మీకు విశ్వాసం ఉన్నా, అప్పుడప్పుడూ విదేశీయులు మీమధ్యలోకి జొప్పించిన దేవతలందరిమీద కూడా మీకు విశ్వాసం ఉన్నా, మీమీదనే మీకు విశ్వాసం లేకపోతే మీకు మోక్షం లేదు.

⊛ ⊛ ⊛ ⊛ ⊛

ఈ శ్రద్ధలో ఉండే తేడాలే మనిషికీ, మనిషికీ మధ్యనున్న తేడాకుగల కారణం. ఒక మనిషిని గొప్పవాడిగా చెయ్యడానికీ, ఒక మనిషిని బలహీనుడిగా,

దిగజారినవాడిగా చెయ్యడానికీగల కారణం ఈ శ్రద్ధలోవున్న తేడాయే.

⊛ ⊛ ⊛ ⊛ ⊛

## బలము, నిర్భయత్వము

బలమే జీవనం. బలహీనతయే మరణం. బలమే సంక్షేమం, అంతమేలేనిజీవితం, అమరత్వం. బలహీనతయే. అంతులేని శ్రమ, దుఃఖం. బలహీనతయే మరణం.

⊛ ⊛ ⊛ ⊛ ⊛

బలహీనతకు విరుగుడు బలాన్ని గురించి ఆలోచించడమే కానీ బలహీనత గురించి చింతించడం కాదు. మనుష్యులకు వారిలోనే దాగివున్న శక్తిని గురించి బోధించండి.

⊛ ⊛ ⊛ ⊛ ⊛

నిలబడినా, మరణించినా మీ బలం మీదనే ఆధారపడండి. ప్రపంచంలో పాపమనేదివుంటే అది

బలహీనతేగానీ మరొకటికాదు. అన్నిరకాల బలహీనతల్ని వదిలిపెట్టండి. ఎందుకంటే బలహీనతయే పాపం. బలహీనతయే మరణం.

⊛ ⊛ ⊛ ⊛ ⊛

మీరు ఎలా అనుకుంటే అలా తయారవుతారు. మిమ్మల్ని మీరు బలహీనులనుకుంటే బలహీనులుగా తయారవుతారు. మిమ్మల్ని మీరు బలవంతులనుకుంటే, బలవంతులుగా తయారవుతారు.

⊛ ⊛ ⊛ ⊛ ⊛

దేనికీ భయపడవద్దు! మీరు అద్భుతమైన పనులు చేస్తారు! భయపడిన మరుక్షణం, మీరు ఎందుకూ కొరగానివారయిపోతారు. ఈ ప్రపంచంలో దుఃఖాన్ని కలిగించే ఒకేవొక్క గొప్పకారణం భయమే. భయమే అన్నిటికన్నా పెద్దమూఢనమ్మకం. భయమే మన కష్టాలకు కారణం. నిర్భయత్వం క్షణాలమీద మనకు

మోక్షాన్ని తెచ్చిపెడుతుంది. కాబట్టి, "లెండి! మేల్కోండి! గమ్యాన్ని చేరుకునే వరకూ ఆగకండి!"

❂ ❂ ❂ ❂ ❂

ఈ భూమిమీద సుఖపడేవారు ధీరులే. ఇది తిరుగులేని నిజం. ధీరులై ఉండండి! ఎల్లప్పుడూ, "నాకెటువంటి భయమూ లేదు" అని పలకండి! భయమే మరణం, భయమే పాపం, భయమే నరకం, భయమే అధర్మం, భయమే తప్పుడు జీవితం. ఈ ప్రపంచంలోని వ్యతిరేకపు ఆలోచనలు, అపోహలు అన్నీ ఈ భయమనే దుష్టశక్తి ద్వారా పుట్టినవే.

## పనిచెయ్యడంలోని రహస్యం

మనుషులందరూ స్వభావసిద్ధంగా కోరుకునే గమ్యమైన ఆ ముక్తిని నిస్వార్థమైన పనిద్వారా పొందడాన్నే 'కర్మయోగమని' అంటారు. అందుచేత, ప్రతి స్వార్థపూరితమైన పని, మనల్ని ఆ గమ్యాన్ని చేరకుండా అడ్డుపడుతుంది. ప్రతి నిస్వార్థమైన పని

మనల్ని ఆ గమ్యం వైపు తీసుకుపోతుంది. అందుచేత నీతిగా జీవించడమంటే ఏమిటో నిర్వచించాల్సి వస్తే అది ఇదే: "ఏదైతే స్వార్థంతో చేస్తామో అది నీతి కాదు (అనైతికం), ఏదైతే నిస్వార్థంగా చేస్తామో అదే నీతి" (నైతికమైనది).

⊛ ⊛ ⊛ ⊛ ⊛

ఒకే ఆలోచనను (పనిని) చేపట్టండి. దానినే మీ జీవితంగా మలచుకోండి. దానినే తలపోయండి, దానినే కలగనండి, దానిమీదే జీవించండి. మీ మెదడు, కండరాలు, నరాలు, మీ శరీరంలోని ప్రతిభాగం, అదే ఆలోచనతో నిండిపోనివ్వండి. దాన్నితప్ప మిగిలిన ప్రతిఒక్క ఆలోచనను విడిచిపెట్టండి. విజయానికి దారి ఇదే! ఈ పద్ధతి ద్వారానే గొప్పగొప్ప మహాత్ములైన సత్పురుషులు తయారయ్యారు. మిగిలినవాళ్ళందరూ వట్టి చిలకపలుకుల యంత్రాలే!

⊛ ⊛ ⊛ ⊛ ⊛

నేను మీకు మళ్ళీమళ్ళీ చెప్పేదేమిటంటే, మీరు పవిత్రంగా ఉండి, ఎవరు మీవద్దకు వచ్చినా సరే, మీ

శక్తికొద్దీ వారికి సహాయం చెయ్యండి. అదే సత్కర్మ(మంచి కర్మ). ఈ (సత్కర్మవల్ల కలిగే) శక్తితో హృదయం పవిత్రమై, చిత్తశుద్ధి కలుగుతుంది. అప్పుడు ప్రతిజీవిలోనూ ఉన్న శివుణ్ణి చూడగలుగుతాము.

❁ ❁ ❁ ❁ ❁

## నిజమైన మతం

మానవునిలో ముందుగానే ఉన్న దివ్యత్వానికి రూపుదిద్దేదే మతం.

❁ ❁ ❁ ❁ ❁

నాయనలారా! మతంయొక్క రహస్యం ఆచరణలోనే కానీ సిద్ధాంతాలలో లేదు. మంచిగా ఉండడం, మంచిని చెయ్యడం - ఇదే మతమంతా!

❁ ❁ ❁ ❁ ❁

ఒక మొరటువాణ్ణి మనిషిస్థాయికి, మనిషిని దేవుడిస్థాయికి ఉద్ధరించే బోధనావిధానమే మతం.

# భారతదేశం మన జన్మభూమి

భారతదేశపు జాతీయాదర్శాలు త్యాగము, సేవ. దేశాన్ని వాటి ఒరవడిలో మరింత తీవ్రంగా ముందుకు సాగనివ్వండి. మిగిలినవన్నీ వాటికవే సర్దుకుంటాయి.

❁ ❁ ❁ ❁ ❁

ఆధ్యాత్మికతయే మన జాతికి రక్తం. అది స్వచ్ఛంగా ప్రవహిస్తే, దాని ప్రవాహం బలంగా, పవిత్రంగా, ఉత్తేజంగా ఉంటే అన్నీ చక్కబడతాయి. ఆ రక్తం కల్తీ లేకుండా ఉంటే రాజకీయంగా, సామాజికంగా ఇంకా భౌతికంగా, ఎటువంటి లోటుపాట్లు ఉన్నా, చివరకు దేశంలోవున్న పేదరికంతో సహా అన్నీ నయమవుతాయి.

❁ ❁ ❁ ❁ ❁

నేను తిరిగివచ్చేటప్పుడు ఒక ఆంగ్లేయ స్నేహితుడు, "స్వామీ! విలాసవంతమైన, తేజోవంతమైన, శక్తిమంతమైన ఈ పాశ్చాత్యదేశాలలో నాలుగేళ్ళపాటు ఉన్న తర్వాత, ఇప్పుడు మీ జన్మభూమిని గురించి మీరు ఏమనుకుంటున్నారు?" అని ప్రశ్నించాడు. నేను దానికిలా

మాత్రమే జవాబివ్వగలిగాను: "నేను ఇక్కడికి వచ్చేముందు భారతదేశాన్ని ప్రేమించాను. కానీ ఇప్పుడు నాకు ఆ దేశపు దుమ్ముకూడా పరమపవిత్రంగా తోస్తున్నది. అక్కడి గాలికూడా నాకు పవిత్రంగా తోస్తున్నది. ఇప్పుడు నాకు ఆ దేశమే ఒక పుణ్యభూమి, ఒక తీర్థయాత్రాస్థలం!"

❁ ❁ ❁ ❁ ❁

ఈ సందేశాన్ని ప్రపంచపు నలుమూలలకు వ్యాపింపచెయ్యాలంటే, అందుకు తమ సర్వస్వాన్నీ త్యాగం చెయ్యడానికి సిద్ధంగావున్న మనుష్యులు ఎక్కడున్నారు? ఈ సత్యాన్ని నలుదిక్కులకూ వ్యాప్తి చెయ్యగల ధీరులైన పురుషులు కావాలి. వేదాంతం బోధించిన గొప్పసత్యాలను వెదజల్లటం కోసం విదేశాలకు వెళ్ళటానికి అటువంటి ధీరులైన కార్యకర్తలు కావాలి. ప్రపంచానికి అది అవసరం. అది లేకపోతే ప్రపంచం నాశనమవుతుంది. పాశ్చాత్య ప్రపంచమంతా ఒక అగ్నిపర్వతం మీద కూర్చొని ఉంది. రేపే అది పేలిపోవచ్చు. రేపే అది ముక్కలయిపోవచ్చు. వాళ్ళు

సుఖాలముంతతో చిత్తుగా త్రాగి అందులో ఏమీలేదని తెలుసుకున్నారు. భారతదేశపు ఆధ్యాత్మిక సత్యాలు ఆ పాశ్చాత్యంలోనికి లోతుగా పాతుకోవడానికి కావలసిన పని చెయ్యడానికి ఇదే అదను. ఓ భారతదేశమా! మేలుకో! నీ అధ్యాత్మికతతో ప్రపంచాన్ని జయించు!

❀ ❀ ❀ ❀ ❀

మానవాళికి, ప్రపంచం మొత్తానికి మంచి చెయ్యడానికి గ్రామగ్రామానికీ తిరగండి! ఇతరులకు ముక్తిని కొనితేవడానికి అవసరమైతే మీరే నరకానికి పోండి! ఇతరులకు మంచిచెయ్యడం ద్వారా మాత్రమే మనిషి తన మంచిని సాధించుకోగలుగుతాడు. భక్తిని, ముక్తిని సాధించడానికి ఇతరులకు త్రోవచూపడం ద్వారానే మనిషి తానుకూడా వాటిని అందుకోగలుగుతాడు. ఈ ఆలోచననే చేపట్టండి. దానికోసం మిమ్మల్ని మీరు మర్చిపోండి. అదే ఆలోచనతో పిచ్చివారుగా మారిపోండి!

❀ ❀ ❀ ❀ ❀

# మన మహిళలు

ఏ కుటుంబాలలో స్త్రీలు సంతోషంగా ఉండి, చక్కగా గౌరవింపబడతారో అటువంటి కుటుంబాలను దేవతలు ఆశీర్వదిస్తారు. కొడుకులను ఎంత శ్రద్ధగా, జాగ్రత్తగా పెంచి, చదివిస్తామో కుమార్తెలను కూడా అంతే శ్రద్ధతో, జాగ్రత్తతో పెంచి, చదివించాలి.

⊙ ⊙ ⊙ ⊙ ⊙

చక్కగా చదువుకుని, పవిత్రమైన శీలం గలిగిన తల్లులున్న ఇళ్ళలోనే మహాత్ములు జన్మిస్తారు.

⊙ ⊙ ⊙ ⊙ ⊙

భారతదేశంలో మహిళలకు ఆదర్శం మాతృత్వమే. ఆ అద్భుతమైన, నిస్వార్థమైన తల్లి, అన్నింటినీ భరించి, ఎల్లవేళలా క్షమించే తల్లి మన మహిళలకు ఆదర్శం.

⊙ ⊙ ⊙ ⊙ ⊙

# మానవునిలోని దివ్యత్వం

ప్రతి మనిషిలోనూ దివ్యత్వం వెలికితీసేందుకు సాధ్యమయ్యే విధంగా ఉంది. మనకు లోపల, వెలుపల ఉన్న ప్రకృతిని స్వాధీనం చేసుకోవడం ద్వారా ఆ దివ్యత్వాన్ని ప్రకటించడమే జీవితగమ్యం. దాన్ని పని ద్వారా (కర్మయోగం), ఆరాధన ధ్వారా (భక్తియోగం), మానసిక నియంత్రణ ద్వారా (రాజయోగం), నిత్య-అనిత్యాల విచక్షణ (జ్ఞానయోగం) ద్వారా సాధించవచ్చు. ఈ నాలుగు పద్ధతులలో ఏదోవొక పద్ధతి ద్వారా గానీ, ఒకటి కన్నా ఎక్కువ పద్ధతుల ద్వారాగానీ, అన్ని పద్ధతులను కలిపి గానీ ఆచరించండి. స్వేచ్ఛగా మీకు నచ్చిన దాన్ని ఎంచుకోండి. మతం చెప్పేదంతా ఇదే. మతబోధనలు, నమ్మకాలు, పూజాపునస్కారాలు, మతగ్రంథాలు, దేవాలయాలు, దేవుళ్ల రూపాలు - ఇవి ఎన్నయినా ఉండవచ్చు, కానీ అవి కాదు ముఖ్యం.

వారివారి నిజస్వభావం ఏమిటో అందరికీ బోధించండి! మీకు మీరే బోధించుకోండి! నిద్రిస్తున్న మీ ఆత్మను ఎలుగెత్తి పిలవండి! అది ఎంత చక్కగా మేలుకుంటుందో చూడండి. ఎప్పుడైతే ఈ నిద్రిస్తున్న ఆత్మ తనను తాను తెలుసుకుని, పనికి ఉద్యమిస్తుందో అప్పుడు శక్తి వస్తుంది, ఖ్యాతి వస్తుంది, మంచి వస్తుంది, పవిత్రత వస్తుంది, విశిష్టమైన ప్రతివొక్కటీ వస్తుంది.

❁ ❁ ❁ ❁ ❁

ఒక జాలరి తనను తాను ఆత్మస్వరూపునిగా తెలుసుకుంటే అతడు మరింత మంచి జాలరి అవుతాడు. ఒక విద్యార్థి తనను తాను ఆత్మగా భావిస్తే మరింత ప్రతిభావంతుడవుతాడు. ఒక న్యాయవాది తనను తాను ఆత్మస్వరూపునిగా తెలుసుకుంటే మరింత మంచి న్యాయవాది అవుతాడు.

❁ ❁ ❁ ❁ ❁

శక్తి అంతా మీలోనే ఉంది. మీరు ఏమైనా చెయ్యగలరు, ప్రతిదీ చెయ్యగలరు. దీన్ని నమ్మండి.

మీరు బలహీనులని భావించకండి. ధీరులై లేచి నిలబడి, మీలోని దివ్యత్వాన్ని ప్రకటించండి.

⊛ ⊛ ⊛ ⊛ ⊛

నా ఆదర్శాన్ని కొద్దిమాటలలో చెప్పవచ్చు. అదేమిటంటే మానవాళికి వారిలోని దివ్యత్వాన్ని బోధించడం; జీవితంలోని ప్రతి కదలికలో, పనిలో దాన్ని ఎలా ప్రకటించాలో నేర్పడం.

⊛ ⊛ ⊛ ⊛ ⊛

## ధ్యాన కౌశలం

ధ్యానమే అత్యుత్తమమైనది. ధ్యానంలో ఉన్న మనస్సే ఆధ్యాత్మిక జీవితానికి దగ్గరి దారి. రోజువారీ జీవితంలో ధ్యానంచేసే ఆ ఒక్క క్షణంలోనే మనం ఎంతమాత్రం భౌతికంగా ఉండము. ఆ ఒక్క క్షణంలోనే మనలోని ఆత్మ, తనను గురించిన ఆలోచనలోనే నిమగ్నమై, అన్నిరకాల భౌతిక విషయాల నుంచి

విడివడిపోయి, అత్యద్భుతమైన పరమాత్మ యొక్క స్పర్శను పొందుతుంది.

మీ శక్తిని మాట్లాడడంలో వృథా చెయ్యకుండా మౌనంగా ధ్యానం చెయ్యండి. బయటి ప్రపంచపు ఉరవడి మీలో ఎటువంటి అలజడిని కలిగించనివ్వవద్దు. మీ మనస్సు ఆ అత్యున్నతస్థితిలో ఉన్నప్పుడు మీకు దాని స్పృహ ఉండదు. ఆ నిశ్శబ్దపు ప్రశాంతతలో శక్తిని మరింతగా నిలువ చేసుకోండి. ఒక ఆధ్యాత్మిక శక్తిజనకయంత్రంగా తయారుకండి.

ఈ (ఆలోచనల) అలలు పైకి లేవకుండా అదుపుచెయ్యడానికి ధ్యానం ఒక అతిచక్కని పద్ధతి. ధ్యానం ద్వారా ఈ అలోచనల్ని అణచివెయ్యవచ్చు. రోజుల తరబడి, నెలల తరబడి, సంవత్సరాల తరబడి అది మీకు అలవాటుగా తయారయ్యేంతవరకూ, మీ ప్రమేయం లేకుండా దానంతట అదే కుదిరేంతవరకూ

సాధన చెయ్యండి. అప్పుడు కోపం, ద్వేషం అదుపుచెయ్యబడి మీ స్వాధీనంలోకి వస్తాయి.

⊛ ⊛ ⊛ ⊛ ⊛

## శ్రీ రామకృష్ణులు

వేదాలూ, వేదాంతమూ, ఇతర అన్ని అవతారాలూ కలసి గతంలో ఏమి చేశారో వాటినన్నింటినీ ఒక్క జీవితంలోనే ఆచరించి చూపించడానికే శ్రీ రామకృష్ణులు జన్మనెత్తారు.

⊛ ⊛ ⊛ ⊛ ⊛

శ్రీ రామకృష్ణ పరమహంస దేవులను ముందుగా అధ్యయనం చెయ్యకుండా, వేదాలు, వేదాంతము, భాగవతము, ఇతరపురాణాల యొక్క నిజమైన అంతరార్థాన్ని ఎవ్వరూ తెలుసుకోలేరు. భారతీయ ఆధ్యాత్మిక ఆలోచనావిధానం మీద అనంతమైన శక్తితో వెలుగును ప్రసరించే ఒక జ్యోతి (search light) ఆయన జీవితం. వేదాలకూ, వాటి లక్ష్యానికీ ఆయన ఒక సజీవ

వ్యాఖ్యానం. ఒక్క జీవితకాలంలోనే ఆయన మన జాతీయ మతసంప్రదాయ చక్రాన్ని పూర్తిగా జీవించి చూపించారు.

⊛ ⊛ ⊛ ⊛ ⊛

శ్రీ రామకృష్ణులు (అన్ని అవతారాలలోకీ) కొంగ్రొత్త అవతారం. అత్యంత పరిపూర్ణమైన అవతారం. జ్ఞానము, భక్తి, వైరాగ్యము, ఆచారపరాయణత, మానవాళికి సేవ చెయ్యాలన్న కోరిక - ఇవన్నీ మూర్తీభవించిన రూపం. ఇక ఆయనతో సరిపోలగలిగేవారు ఎవరు? ఆయనను అర్థం చేసుకోలేనివారి జన్మ వ్యర్థం. జన్మజన్మలకూ ఆయన సేవకుణ్ణికావడమే నా అత్యుత్తమమైన అదృష్టం.

⊛ ⊛ ⊛ ⊛ ⊛

భారతదేశం ఇప్పటికి చాలాకాలం బాధలను అనుభవించింది. ఈ ప్రాచీనమతం చాలాకాలం బాధపడింది. కానీ దేవుడు కరుణామయుడు. మరొక్కసారి ఆయన తన బిడ్డల సాయానికి వచ్చాడు. దిగజారిన భారతదేశానికి పైకిలేచే అవకాశం మరొక్కసారి ఇవ్వబడింది. శ్రీ రామకృష్ణుల పాదాలను

ఆశ్రయించడం ద్వారా మాత్రమే భారతదేశం పైకి లేవగలదు. ఆయన జీవితం, ఆయన బోధనలు నలుమూలలకూ వెదజల్లబడాలి. హిందూసమాజంలోని ప్రతి సూక్ష్మరంధ్రంలోనికీ అవి చొచ్చుకుపోవాలి.

⊛ ⊛ ⊛ ⊛ ⊛

ఆధునిక ప్రపంచానికి శ్రీ రామకృష్ణుల సందేశం ఇదే: "మతసూత్రాలను లెక్కచెయ్యవద్దు. మతవిశ్వాసాలనూ, మతవర్గాలనూ, చర్చిలనూ, దేవాలయాలనూ పట్టించుకోవద్దు. ప్రతిమనిషి యొక్క ఉనికికే మూలమయిన పారమార్థికతతో పోలిస్తే అవి ఎందుకూ కొరగావు. మనిషిలో ఆ పారమార్థికత ఎంతగా అభివృద్ధి చెందితే అతడు మంచిని సాధించడంలో అంత శక్తిమంతుడవుతాడు. ముందుగా దాన్ని సంపాదించండి, నేర్చుకోండి. ఎవ్వరినీ విమర్శించవద్దు. అన్ని ధర్మాలలోనూ, మతాలలోనూ ఎంతోకొంత మంచి ఉంటుంది. మతమంటే మాటలు, పేర్లు, ముఠాలు కాదనీ, మతమంటే ఆధ్యాత్మిక అనుభూతి అనీ మీ జీవితాల ద్వారా చూపండి!" కాబట్టి మానవజాతికి నా గురుదేవుల

సందేశం ఏమిటంటే, "ఆధ్యాత్మికతను కలిగివుండి, మీకు మీరే సత్యాన్ని అనుభూతి పొందండి!"

❀ ❀ ❀ ❀

## మరికొన్ని మేలుకొలుపులు

వికాసమే జీవితం. సంకుచితత్వమే మరణం. ప్రేమే జీవితం. ద్వేషమే మరణం.

❀ ❀ ❀ ❀ ❀

ఒక ఔన్సు ఆచరణ ఇరవైవేల టన్నుల ప్రగల్భాలకు సమానం.

❀ ❀ ❀ ❀ ❀

స్వామి వివేకానందుని బోధనలకు మళ్ళీ ప్రత్యేకంగా ఎవరినుంచి, ఎటువంటి పరిచయం అవసరం లేదు. చదివేవారి మీద వాటంతటవే చెరగని ముద్ర వేస్తాయి.

- మహాత్మా గాంధీ

మీరు భారతదేశాన్ని గురించి తెలుసుకోదలుచుకుంటే వివేకానంద స్వామిని అధ్యయనం చెయ్యండి. ఆయన భావాలన్నీ అవును, అవును అనేవే కానీ, కాదు కాదు అనేవి కావు.

-రవీంద్రనాథ్ టాగూర్

ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని ఆయన ఈనాటి భారతదేశాన్ని శక్తిమంతంగా ప్రభావితం చేశారు. స్వామి వివేకానందుల నుంచి పెల్లుబికే ఈ శక్తి, ప్రేరణల ఊటబావిని మన యువతరం సక్రమంగా వినియోగించుకోగలరని నా ఆశ.

-జవహర్‌లాల్ నెహ్రూ

| Title | Price |
|---|---|
| **English** | |
| Human Excellence (Illustrated) | 65.00 |
| Education for Character | 10.00 |
| Art of Meditation | 10.00 |
| What is Real Personality ? | 5.00 |
| Power of Prayer and Art of Positive Thinking | 5.00 |
| **తెలుగు** | |
| మానవ ప్రతిభ (సచిత్రగ్రస్తం) | 50.00 |
| ధ్యాన కౌశలం | 10.00 |
| నిజమైన వ్యక్తిత్వం అంటే? | 5.00 |


ప్రతులకు:

రామకృష్ణ మఠం, దోమలగూడ

హైదరాబాదు - 500 029

ఫోన్: 7633937

ACC No. 99351
...బాద్ - 5000...




3340

Rs : 6/-

వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్
రామకృష్ణ మఠం, దోమలగూడ
హైదరాబాదు - 500 029 ఫోన్: 7633937